# నివురు కప్పిన స్వరూపాలు

శ్రీ చింతలపూడి వేంకటేశ్వరరావు.

సెంట్రల్ స్టేషన్లో కళ్ళుమూసిన సుబ్బారాయుడు గూడూరు స్టేషన్ లో కళ్ళుతెరచి చూశాడు. పైబర్తుమీద నుంచి లేచి, సామాను చూడమని ఒకపెద్ద మనిషితో చెప్పి బండిదిగాడు. భోజనాదులు ముగించుకొని, ఒక పావుగంటయిన తర్వాత, తిరిగి పెట్టె లోనికి వచ్చేసరికి అన్నీ కొత్తమొహాలు కన్పించాయి. ఇద్దరు ముగ్గురు పాత ముఖాలుతప్ప. రిజర్వుచేసి పెట్టుకొన్న స్థలంలోనికి వచ్చి చతికిల పడ్డాడు. ఎదురుగుండా కూర్చున్న వ్యక్తిని చూశాడు. అంతే ...

"ఒక్కసారి స్వర్గసోపానాలు దాటి ఏదోలోకంలోనికి వెళ్ళిపోయినట్లు .... అదే దేవేంద్రుని ఉద్యానవనం .... పారిజాత పవనం ... వళ్ళు పులకరించింది. కళ్ళుపెద్దవి చేసి చూస్తున్నాడు. అందాలభూషణి, కలభాషిణి, కాదు, వయ్యార వంపు సొంపుల వరూధిని. ఉహూం .... అసలే కాదు ... రంభ .... మెనక ... తిలోత్తమ .... ఎవరూ కాదు ... మరెవరు? నవ్వుతున్నాయి కళ్ళు. మెరుస్తుంది వళ్ళు. చలంగారి కథానాయిక మెడవంపు. కృష్ణశాస్త్రిగారి కళామయి నడుము సొంపు, ముందు మొహం వర్ణించాలి జివజవలాడే గులాబీపెదవులు, తళతళ మెరసే చారడేసి కళ్ళు తీర్చిదిద్దినట్లు భ్రూలతలు, సొంపైనముక్కు, బుగ్గల కిరుపక్కలా నవ్వితే సొట్టలు. ఎవరా అందాలరాసి, ఎవరి కోసం సృష్టించబడ్డదీ వూహాసుందరి, ఆ ఉంగరాల జుత్తులో ఏవో అనురాగ తరంగాలు కదులుతున్నట్లుంది.

ఆ కంపార్టుమెంటులో ఎవరికి యిటువంటి ఆలోచనలులేవు, ఒక్క సుబ్బారాయుడికి తప్ప. ఎంతవరకు ఆమె అందాన్ని వర్ణించాలో అంతవరకు వర్ణించుకొని వెళ్ళిపోతున్నాడు. కడుపునిండలేదు కళ్ళు తేలేశాడు. ఎదురుగుండా కూర్చున్న అమ్మాయి తెల్లబోయిచూస్తుంది. ఆమెతో మాట్లాడాలి. ఆమెను మెప్పించి, తానో గొప్పవాడని నిరూపించుకోవాలి. ఆమె హృదంతరంలో అతన్ని చిత్రించుకొనేటట్లు చేయాలి. వార్తాపత్రిక ముఖావికి అడ్డంగా పెట్టుకున్నాడు. పత్రిక తలకిందులు వున్న సంగతే మరచిపోయాడు. చదువుతున్నట్లు నటిస్తున్నాడు అమ్మాయికి నవ్వొచ్చింది. నవ్వింది. బుగ్గలు సొట్టలు పడ్డాయి. అవే కావాలనుకున్నాడు. అవి తన స్వంతం అయినట్లే భావించాడు. పైనుంచి ఎవరో వళ్ళు విరుచుకుంటూ దిగారు. మద్రాసునుంచి వస్తున్నాడతను.

"ఎంతవరకు దాటివచ్చాం!" సుబ్బారాయుడి పక్కగా కూర్చుంటూ అతన్ని అడిగాడు. సుబ్బారాయుడికి వళ్ళు మండిపోయింది. వాడ్ని ట్రయినులోనుంచి తోసి పారేద్దామన్నంత కోపం వచ్చింది. బాగా మాసినగుడ్డలు ముఖం నిండా మట్టిమరకలు, తల వెండ్రుకల నిండా దుమ్ము వుంది. అతనిమీద అసహ్యం పుట్టుకువచ్చింది సుబ్బారాయుడికి. తన స్వంత బండికాదు పొమ్మని చెప్పడానికి గప్ చిప్‌గా మాట్లాడకుండ వూరుకున్నాడు. అతన్ని చూస్తూంటే వున్నట్లుండి ఆలోచనతట్టింది. ఇద్దరిస్థలాలు ఆక్రమించు కొని కూర్చున్నవాడు. కొంచెం వొదిగి స్థలం యిచ్చాడు.

"మద్రాసునుంచేనా రావడం!" సర్దుకొని కూర్చుంటున్న అతన్నిచూచి, అడిగాడు సుబ్బారాయుడు. అతడు అవునని తలవూపాడు.

"ఏవూరు? మద్రాసు ఎందుకు వెళ్ళావు!" కుశల ప్రశ్నలు ప్రారంభించాడు.

"మాది అనకాపల్లి" మద్రాసు ఎందుకెళ్ళింది చెప్పడానికి సంకోచిస్తున్నాడు. చెప్పడానికి భయపడుతున్నాడు. ఈ విషయం సుబ్బారాయుడు యిట్టే గ్రహించాడు.

"నీ మొహంచూస్తుంటే ఏదో తప్పుచేసిన వాడులాగ కన్పిస్తున్నావు. మాసినబట్టలు, పీక్కుపోయిన ముఖం, సంస్కారంలేని జుట్టు, ఇవన్నీ ఏమిటి!" ప్రతి అక్షరం ఆమెకు విన్పించేటట్లు, అతనివేపుకి ముఖంపెట్టి అంటున్నాడు.

"మీరేమి అనరంటే నిజంచెప్తాను. ముందు ఒక సిగరెట్టు వుంటే యిప్పించండి."

సుబ్బారాయుడి దగ్గర సిగరెట్లున్నాయి. ఇవ్వడానికి యిష్ట పడలేదు. తాను సిగరెట్లు కాలుస్తున్నట్లు ఆ అమ్మాయికి తెలిస్తే, తనమీద గౌరవంపోతుందని అనుకున్నాడు.

"నాకు సిగరెట్లు కాల్చే అలవాటులేదు. కాల్చే వాళ్ళను అసహ్యించు కుంటాను."

సుబ్బారాయుడి మాటలు చాల శ్రద్ధగా వింటోందా మ్మాయి. అప్పటికీ తనమీద మంచి భావం ఏర్పడి వుంటుందని ఉవ్విళ్ళూరుతున్నాడు.

"మద్రాసులో పచ్చిమోసం... ఎవర్ని నమ్మకూడదు" ఆ అపరిచయవ్యక్తి ప్రారంభించాడు.

"డబ్బు ఎవరైనా కొట్టేశారా?" తానేదో తిరిగియిచ్చేటట్లు మాట్లాడాడు.

"అయిందానికి యిప్పుడు బాధ పడుతున్నాను."

"చాల మంచివాడివి. జరిగిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాప పడేవారికి, తప్పకుండా మంచి జరుగుతుంది. ఇంతకు నీవు చేసినతప్పు."

"చెప్పడానికి నాకే సిగ్గేస్తుంది. ఇంట్లో నుంచి వచ్చి వారం రోజులయింది. వందరూపాయలు మా అమ్మ పెట్టెలోనుంచి అపహరించి చెన్నపట్టణంవచ్చాను. చిన్నప్పట్నుంచి సినిమాపిచ్చి బాగావుండేది. సినిమాలో చేరిపోదామని పెద్ద హీరో అయిపోదామని, ఒక కంపెనీకి వెళ్ళాను. నన్నో పెద్ద కథానాయకుడ్ని చేస్తానని, "అంతా మోసం" పిక్చర్‌లో తీసుకుంటానని ఆశపెట్టి. ఆ కంపెనీలో పెద్దమనిషి వందరూపాయలు కొట్టేశాడు. మళ్ళా నాకు కన్పించలేదు. అచ్చట పరిస్థితులు బాగా అర్థమయ్యాయి. "అంతామోసం" అని చెప్పే నన్ను మోసం చేశారు. ఒక్క-క్షణం అచ్చట వుండబుద్ధి పుట్టలేదు. చేతిలో చిల్లికానిలేదు. ఆకలి దహించుకు పోయేది. ఇంటికి వెళ్ళిపోడానికి మొహం చెల్లక, ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుందేమో అని, మద్రాసులో ప్రతి బజారు, ప్రతిసందు తిరిగాను. చివరకు హోటల్‌లో క్లీనరు ఉద్యోగం కూడ దొరకలేదు. అభిమానాన్ని చంపుకొని యింటికివెళ్ళి క్షమాపణ వేడుకోవాలని పించింది."

ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఆ అమ్మాయి జాలిగా చూచింది.

"ప్రతివాడికి సినిమాపిచ్చి. లక్షణంగా చదువుకొని యింటిదగ్గర పడివుండక పాడు బుద్ధులు పెట్టుకొని, దొరికింది పట్టుకుపోయి, అలోలక్ష్మణా అంటూ మద్రాసు వీధుల్లో బలాదూరుగా తిరుగుతారు. నీవేమి చేస్తుంటావు?" మంచి అదను దొరికిందని, అవకాశాన్ని ఆమె ముందు సద్వినియోగ పరచు కోవాలని ప్రయత్నం చేస్తున్నాడు సుబ్బారాయుడు.

"స్కూలుఫైనలు చదువుకున్నాను."

"స్కూలు ఫైనల్‌కు వచ్చావు. బాగా డబ్బున్నవాడి లాగ కన్పిస్తున్నావు. శుభ్రంగా చదువుకొనకుండా, ఎందుకుతొందరపడ్డావు? ఇంత చిన్నవయస్సులో భగవంతుడు ఎందుకు కల్గిస్తాడో హృదయ దౌర్బల్యాలను" పెద్ద పెద్ద పదాలు వాడుతున్నానని తనకు తాను ఉప్పొంగి పోతున్నాడు. ఆమెకు అర్థంకాకపోయినా ఫర్వాలేదనుకున్నాడు.

"పెద్ద కంపెనీలో ఉద్యోగం యిప్పిస్తానని ఒక స్నేహితుని మాటనమ్ముకొని, తల్లిదండ్రుల అనుమతి తీసుకొనే మద్రాసు వచ్చాను. ఉద్యోగం దొరికింది. ఏం లాభం? వట్టిచాకిరీ జీతం యిచ్చేవారు కాదు. జీతం అడిగితే అప్రంటీస్ కొంతకాలం చేయాలనేవారు. ఆ వాతావరణం బొత్తిగా పడలేదు. జీతంయిస్తేనే పనిచేస్తానన్నాను. వాళ్ళు వచ్చేనెలనుంచి యిస్తానన్నారు. నాకు నచ్చలేదు. వెంటనే రాజినామాయిచ్చి, గవర్నమెంటు ఉద్యోగంలో చేరాను. ఒకటవ తారీఖువచ్చేసరికి చేతిలో రు- 150 లు పడతాయి. వందరూపాయలు యింటికి పంపుతాను 50 రూపాయిలు ఖర్చుపెట్టు కుంటాను. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, సినిమావల్ల ఏమి ఉపయోగం ఉండదని స్కూలుఫైనలు గట్టిగా చదివి నాల్గు సంవత్సరాలు, కష్టపడి బి. ఎ అన్పించుకున్నావంటే, మంచి ఉద్యోగం వస్తుంది. మీ తల్లిదండ్రులు సంతోషిస్తారు. నీ జీవితం హాయిగాగడచిపోతుంది. అంతేగాని, లక్షలు గడిద్దామని మనదగ్గర సరుకులేక పోయినా హీరో అయిపోదామని కొండంత ఆశలుపెటుకొని, తల్లి దండ్రులకు యిష్టంలేని పనులు చేయకూడదు. పాపం! మీ అమ్మా నాన్నలు నీకోసం ఎంత కుమిలి పోతున్నారో! నీవు మీ ఇంటికి వెళ్ళిన తర్వాత అంతా అర్థమౌతుంది. ఈ పాటికి మీ

నాన్నగారు నీకోసం వెతికిస్తూవుంటారు. వెంటనే యింటికి వెళ్ళి వారికి కన్పింపు ఇంకెప్పుడూ జీవితాలను హత మార్చే ఆలోచనలు పెట్టుకోవద్దు నీకు మంచి భవిష్యత్తు వుంది. చేసినతప్పుకి పశ్చాత్తాప పడుతున్నావు కాబట్టి, భగవంతుడు నిన్నుతప్పకుండారక్షిస్తాడు"సుబ్బారాయుడు ఊపిరి ఆడకుండా లెక్చర్ ఒకే వరవడిలో చెప్పుకు పోతున్నాడు చాల శ్రద్ధగా వింటూన్న ఆమె సుబ్బారా యుడు వంక చూసింది. ఆ చూపుల్లో "తనంటే ఏదో అవ్యాజమైన అనురాగం, అనూహ్యమైన అభిమానం" వెళ్ళబోస్తున్నట్లు ద్యోతక మౌతున్నాయి శరత్ బాబు కథానాయకుడ ననిపించుకున్నాని అనుకున్నాడు. ప్లాను పారింది. ఆమె హృదయంలో తన ఆకారం తయారవు తుంది. అంజతా. ఎల్లోరా హంపి శిల్పాలు శిల్పించినట్లు, ఆమె హృదయంలో అతడు వివిధ రకాల పోజుల్లో శిల్పించ బడినట్లు ఫీలయ్యేడు. రైలు స్టేషనులో ఆగింది ?

"ఆకలిగా వుంది. ఒకఅణా వుంటే ఇవ్వరు !" అపరిచితుడు అడుగుతున్నాడు. సుబ్బారాయుడు వులిక్కి పడి అతని వేపుచూశాడు.

"నా కివ్వడానికి అభ్యంతరం లేదు గాని నీ వింకా బాధపడాలి నీవు చేసిన పొరపాటువల్ల పర్యవసానం నిన్ను బాగా బాధపెట్టాలి. అప్పటికిగాని, నీలో సంపూర్ణ పరివర్తనరాదు "

ప్రతిపదం తూచి తూచి వేసినట్లు. ప్రతిమాటలో ఎంత డబ్బిచ్చి కొనుక్కున్న లభ్యంకానంత హితోప దేశం వుట్టిపడేట్లు మాట్లాడు తున్నానని తన అఖండమైన విజ్ఞానాన్ని ఆమె తప్పకుండా గుర్తించి వుంటుందని సం తోషించాడు, ప్రక్కన కూర్చున్నవాడు బండిదిగి వెళ్ళి పోయాడు ఆ సమయంలో అతడు వెళ్ళి పోవడమే, సుబ్బారాయుడుకి కావలసింది. ఆ అమ్మాయి మళ్ళా సుబ్బారాయుడి వంక చూచింది.

"అఖండ పంచ వర్ష ప్రణాళిక .. కాదు కాదు . . . బ్రహ్మాండ పంచ నిమిషాల పథకం, తయారవడం . . ఆచరణ యోగ్యంకావడం ఫలం దక్కడం అన్నీ ఒక్క సారే జరిగాయి " మనస్సులోఅనుకుంటూ, ఆమె చురుకు చూపులను కలుపుకున్నాడు. బండి కదిలింది భగ్న హృదయుడు మళ్ళా ఆ పెట్టెలోఎక్కలేము ఆ అమ్మాయి ప్రక్కగా పెట్టిన పత్రిక తీసుకుంది. దానితో పడిందను కున్నాడు సుబ్బారాయుడు. ఆ అమ్మాయి తాలూకు మను ష్యులంతా నిద్రపోతున్నారు.

"ఎక్కడినుంచి వస్తున్నారు" భయకంపిత స్వరంతో కొంచెం డేరింగ్ చేశాడు.

"తిరుపతి నుంచి వస్తున్నాం" సమాధానం అనుకూ లంగానే వచ్చింది ఆకాశంలోనికి ఒక్కసారి ఎగిరి గెంతేంసి. పూలపాన్పుమీదపడినట్లనుపించింది రాయుడికి.

"యాత్రలు చేస్తున్నట్లున్నారు ?" భయం ఛాయలు తగ్గుతున్నాయి.

"అవును అన్నవరం కొండకు వెళ్తున్నాం" వార్తా పత్రిక తిరగవేస్తూంది

"నాకు యాత్రలంటే బొత్తిగా నమ్మకంలేదు సుమండి ఆత్మారాధన ఆత్మజ్ఞానం అవసరం, మనిషి చేసిన రాయిరప్పకు మొక్కుతూంటే మనం వాళ్ళకంటే కనిష్టం అంటాను. వొప్పుకుంటారా ?

"అవును నిజమే కాని అందరికి మీలాగ ఆత్మారాధన ఆత్మజ్ఞానం వుండదు కదాండీ ! యాత్రలుచేస్తూ. కన్పించిన ప్రతిరాయిరప్పకు మొక్కుతుంటే తాము కోరిన ఫలాలు, జరుగుతాయని ఆశ. "

"అంతరాత్మలో పవిత్రత లేనపుడు ఎన్ని ప్రయ త్నాలు జరిగినా లాభంలేదు. మానవుని జీవిత చరిత్ర ప్రారంభమైన ఎన్నో యుగాలు గడచాయి. ఏ యుగంలో నైన దేవునికి లంచమిచ్చి, తాముకోరిన ఫలాన్ని పొంద గలిగిన వారెవ్వరూ లేరని నా నమ్మకం. "

ఆమె మాట్లాడకుండా వూరుకుంది. పత్రిక తీసి చదు వుతోంది. కొంచెం సేపటికి బండి ఒంగోలు స్టేషనులో ఆగింది. అదే కంపార్టుమెంటులో సుబ్బారాయుడు స్నేహి తు డెక్కాడు. ఆతడు రాయుడ్నిచూచి నిర్ఘాంతపోయాడు.

"ఏరానాన్న ! ఎప్పట్నుంచి ఈ పాడు బుద్ధులు?" పత్రిక చదువుతూన్న ఆమె దృష్టిమళ్ళించి రాయుడిస్నేహి తుని మాటలు వింటోంది.

"మీ నాన్న లబోమని మొత్తుకుంటున్నాడు, మీఅమ్మ ఒకటే ఏడుపు. ఆమె మంచం పట్టింది. నాల్గువందలు తీసికొని మరీబయలు దేరావటగా ! ఇంత పొగరా కొంపకేనా?"

ఆ అమ్మాయికేమీ అర్థంకాలేదు. అతనిమీద ఇంతకు ముందు పూజ్యభావం యేర్పడింది. చాలా గొప్పవాడు, విజ్ఞాని అనుకుంది. ఇప్పుడు ?

"నీ మొహం! నిన్నెవరురా సినిమాలో చేర్చుకొనేది ఒకవేళ చేర్చుకున్నా మేమాసినిమాకు వెళ్ళాలా! వద్దా!"

ఆ అమ్మాయి సుబ్బారాయుడి వంక చూచింది. కత్తి వేటుకి నెత్తురుచుక్క వుండదు. నల్లబడిపోయి వుంది. చేతులు వణికిపోతున్నాయి. ముఖంనిండా ముచ్చెమటలు పోశాయి.

"సమాధానం చెప్పవేరా ? అట్లాగ బిగుసుకుపోతావేం ?" సుబ్బారాయుడికి కళ్ళు తిరిగాయి. స్పృహతప్పి పడిపోయాడు. ఆ అమ్మాయి కంతా అద్దంలో చూచినట్లయింది. చేతిలోవున్న వార్తా పత్రిక పిడికిటిలో చుట్టగా చుట్టుకొని పోయింది. తనముందు 'షైను' అవుదామని చేసిన ప్రయత్నమన్న మాట. మేడిపండు బలే పెద్దమనిషి. మరొకవైపుకి అతనికి కన్పించకుండా వచ్చి కూర్చుంది.

రైలు పడుతూంది. ఆమెకు బండి దిగి వెళ్ళిపోయిన మనిషి కన్పిస్తున్నాడు. అతనితో సుబ్బారాయుడ్ని చంపాలనిపించింది.

---


స్థాపితం : 1923

## ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

ప్రధానకార్యాలయము : మచిలీపట్టణము.

| | | |
|---|---|---|
| చెల్లింపబడిన మూలధనము, మరియు రిజర్వులు | రు. 47, 00, 000 | మించినది. |
| అమలునందున్న వ్యాపార మొత్తము | రు. 9, 50, 00, 000 | మించినది. |

**మద్రాసులోని శాఖలు :**

6, లింగిచెట్టివీథి, మద్రాసు 1. 77, కచేరీవీథి, మైలాపూరు, మద్రాసు 4.
87, త్యాగరాయరోడ్డు, త్యాగరాయనగరు, మద్రాసు 17.

**కర్నూలు ఆఫీసులు :**

1/9 మెయిన్ బజారు, పేట.
లెజిస్లేచరు శెక్రటేరియట్ భవనము (ఈ పై ఆఫీసు అసెంబ్లీ సెషన్సు జరుగుచున్నంతకాలము తెరచియుంచబడును.)
మరియు ఆంధ్రరాష్ట్రి మందంతటా, బళ్ళారి పట్టణములోను, హైదరాబాదు రాష్ట్రమున సికింద్రాబాదు, ఖమ్మంమెట్టు, వరంగల్‌లోను బ్రాంచీలు, సబ్ ఆఫీసులు కలవు.

**లండన్ ఏజెంట్లు :**

బార్‌క్లేస్ బ్యాంకు లిమిటెడ్, ఛీఫ్ ఫారిన్ బ్రాంచి, 168 ఫెన్ చెర్చ్ స్ట్రీట్. లండన్, ఇ.సి. 3.
సేవింగ్సు డిపాజిట్లు నూటికి సంవత్సరమునకు రు. 2-8-0 వడ్డీ చొ॥ నెలవారీ నిలువమీదను
కరెంటు డిపాజిట్లు నూటికి సంవత్సరమునకు రు. 0-8-0 వడ్డీ చొ॥ రోజువారీ నిలువలమీదను అంగీకరించబడును.
ఫిక్సెడ్డు డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు 3. 6, 9, 12, 24, మాసములకు అంగీకరిండును.చబ మూడు సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు 100 కి రు. 90/- చొ॥ యివ్వబడును. బంగారు వస్తువులమీద, గవర్నమెంటు పత్రములమీద, బులియను ధాన్యము మరియు తదితర ఆహారదినుసులమీద అప్పులు యివ్వబడును.
చెక్కులు, హుండీలు వసూలు చేసిపెట్టబడును. ఫారిన్ ఎక్సేంజి సహా అన్నిరకముల బ్యాంకింగు వ్యాపారములు చేయబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగు డైరెక్టరు.

ఏలేశ్వరపు రామచంద్రమూర్తి,
ఎం.ఏ., సి.ఎ.ఐ.ఐ.బి.,
జనరల్ మేనేజరు.